సాక్షి
వనపర్తి
శుక్రవారం । 13 । జూన్ । 2025



కోయిల్‌సాగర్‌కు కృష్ణా జలాలు

జూరాలకు వరద కొనసాగుతుండటంతో కోయిల్‌సాగర్‌కు నీటిని తరలిస్తున్నారు.

వివరాలు 8లో ▸



టీజీపీఈసెట్ ఈవెంట్స్

పాలమూరు యూనివర్సిటీలో టీజీపీఈ సెట్ ఈవెంట్స్ గురువారం కొనసాగాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
33.5 /22.7

వాతావరణం

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి: మహిళ, శిశు అభివృద్ధి **మంత్రిత్వశాఖ**, భారత ప్రభుత్వం తరఫు**న ఇవ్వనున్న** ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ జిల్లా అధికారి కె.సుధారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవిష్కరణలు, సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్, టెక్నాలజీ తదితర రంగాల్లో ప్రతిభ చూపిన 18 ఏళ్లలోపు బాలలు జూలై 31లోగా http://awards.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

బాలల హక్కులు పరిరక్షించాలి



ఆత్మకూర్: బాలల హక్కులను పరిరక్షించాలని, వారు చదువుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని న్యాయమూర్తి శ్రీలత కోరారు. ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 18 ఏళ్లలోపు వారందరికి బాలల హక్కులు వర్తిస్తాయని, పిల్లల జీవనం, ఆరోగ్యం, విద్య, రక్షణ, అభివృద్ధి, సంక్షేమానికి తల్లిదండ్రులు కట్టుబడి ఉండాలని సూచించారు. పిల్లలను పాఠశాలకు కాకుండా పనులకు పంపించడం చట్టరీత్యా నేరమని.. బాలలను స్వేచ్ఛాయుత వాతావరణంలో భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీకే రాములు, ప్రధానకార్యదర్శి ముక్తేశ్వర్, ఉపాధ్యక్షుడు దివాన్జీ అశోక్‌కుమార్, శంకర్‌లింగం, వినయ్‌కుమార్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు మిషన్ ప్రారంభించాలి

వనపర్తి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు జాతీయస్థాయిలో ప్రత్యేక మిషన్ ఏర్పాటు చేయాలని ఆర్డీఎస్ అధ్యక్షురాలు చిన్నమ్మ థామస్ కోరారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లాకేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆర్డీఎస్, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థలు సంయుక్తంగా 'బాలల హక్కుల రక్షణ' అనే అంశంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. త్వరలోనే జిల్లాను బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. గతేడాది జిల్లా యంత్రాంగం సహకారంతో 162 రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించి 330 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామని తెలిపారు. జిల్లాస్థాయి బాలకార్మిక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయడంతో సాధించిన పురోగతిని పరిశీలించి జాతీయస్థాయిలో మిషన్‌ను ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జాతీయ కన్వీనర్ రవికాంత్ మాట్లాడుతూ.. 'భారతదేశం ఐఎల్ఓ (అంతర్జాతీయ లేబర్ ఆర్గనైజేషన్) కన్వెన్షన్ 182పై సంతకం చేసిందని.. అభివృద్ధి చెందిన దేశంగా మార్పునకు బాల కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబించడం, విద్యావంతులు, నైపుణ్యాభివృద్ధి సాధించడం, చట్టపరమైన ప్రాసిక్యూషన్ యంత్రాంగాన్ని బలోపేతం చేయడంతోనే సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ అంజాద్, సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ!

జిల్లాలో నత్తనడకన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు



చింతరెడ్డిపల్లిలో బేస్‌మెంట్ వద్ద నిలిచిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

- పైలెట్ గ్రామంగా మండలానికి ఒకటి ఎంపిక
- 14 గ్రామాలు.. 1,131 మంది లబ్ధిదారులు
- స్లాబ్ వరకు చేరినవి కేవలం 10 మాత్రమే..
- బేస్‌మెంట్ లేవల్‌కు వచ్చినవి 499

అమరచింత: అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టింది. పథక ప్రారంభంలో జిల్లాలో మండలానికి ఒక గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి పేదలను గుర్తించి జనవరి 26న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించారు. ఇంటి నిర్మాణంలో పాటించాల్సిన విధి విధానాలను గ్రామసభల ద్వారా అధికారులు తెలియజేశారు. కాని అధికారుల గైడ్‌లైన్స్ ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టలేమంటూ లబ్ధిదారులు నిర్మాణాలకు ఆసక్తి కనబర్చడం లేదు. దీంతో అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకొచ్చి పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేశారు. మొత్తం 14 గ్రామాల్లో 1,131 మంది లబ్ధిదారులను గుర్తించి ఇంటి నిర్మాణ పత్రాలు అందించారు. వీటిలో ఇప్పటి వరకు 499 బేస్‌మెంట్ లేవల్‌కు, 54 రూఫ్ లేవల్‌కు, కేవలం 10 ఇళ్లు మాత్రమే స్లాబ్ లేవల్‌కు వచ్చినట్లు హౌసింగ్ అధికారులు చెబుతున్నారు.

బ్యాంకు ఖాతాల సమస్య..

లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సమస్యలు తలెత్తడంతో బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోంది. జాతీయ బ్యాంకుల్లో ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు హౌసింగ్‌శాఖ విడతల వారీగా చెల్లిస్తున్నారు. కాని ఇప్పటి వరకు యూనియన్ బ్యాంకులో మాత్రమే ఇలాంటి సమస్య తలెత్తిందని.. గుర్తించి పరిష్కరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అవగాహన కల్పిస్తూ..

ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవడం సాధ్యం కాదంటూ లబ్ధిదారులు మండల పర్యటనకు వచ్చిన అధికారులకు ఇంటి మంజూరు పత్రాలను వెనక్కి ఇస్తున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో అధికారులు వారానికోమారు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి త్వరగా బేస్‌మెంట్ నిర్మిస్తే రూ.లక్ష మంజూరు చేస్తామని, అధైర్యపడొద్దని భరోసానిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

బిల్లుల చెల్లింపులు..

మొదటి బిల్లు రూ.లక్ష బేస్‌మెంట్ నిర్మించిన తర్వాత లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో జమచేస్తారు. రెండోబిల్లు రూ.లక్ష గోడలు నిర్మించిన తర్వాత, మూడో బిల్లు రూ.రెండు లక్షలు స్లాబ్ వేసిన తర్వాత, చివరి బిల్లు రూ.లక్ష మరుగుదొడ్డి, ఇంటి పనులు పూర్తి చేసిన తర్వాత చెల్లిస్తారు.

అడ్డంకిగా మారిన నిబంధనలు..

- మంజూరు పత్రం అందుకున్న 45 రోజుల్లో పనులు ప్రారంభించాలి.
- ఇంటి నిర్మాణం 400 X 600 విస్తీర్ణం మించకుండా, ఆర్‌సీసీతో నిర్మించుకోవాలి. రెండు గదులతో పాటు వంట గది, మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలి.
- అనర్హులుగా తేలినా, నిబంధనలకు విరుద్ధంగా ఇల్లు నిర్మించినట్లు తెలిసినా ఇంటి మంజూరును రద్దు చేస్తూ అప్పటి వరకు చెల్లించిన బిల్లును ఆర్ఆర్ చట్టం ప్రకారం తిరిగి వసూలు చేయబడును.



చింతరెడ్డిపల్లిలో కొనసాగుతున్న స్లాబ్ నిర్మాణం

బేస్‌మెంట్ నిర్మించినా బిల్లు రాలే..



అధికారులు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం ఇచ్చారు. దీంతో అప్పు చేసి బేస్‌మెంట్ వరకు నిర్మించినా ఇప్పటి వరకు రూ.లక్ష ఇవ్వలేదు. కారణం ఏమిటంటే బ్యాంకు ఖాతాలో తేడాలున్నాయని అధికారులు చెబుతున్నారు. త్వరగా బిల్లు చెల్లించి ఆదుకోవాలి.

– అంజమ్మ, చింతరెడ్డిపల్లి (అమరచింత)

అప్పు చేసి నిర్మాణం..



బిల్లు త్వరగా వస్తుందని రూ.50 వేలు అప్పుచేసి బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణం చేపట్టా. ఇప్పటి వరకు బిల్లు రాక పోవడంతో పనులు నిలిపివేశా. మండలంలోని యూనియన్ బ్యాంకులో ఖాతా తెరవమన్నారు.. ఇప్పటి వరకు బిల్లు మాత్రం రాలేదు. ఎంపీడీఓతో పాటు అధికారులు వచ్చి పనులు చేపట్టాలని బిల్లు వస్తుందని భరోసానిస్తున్నారు. మొదటి బిల్లు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తా.

– వై.అనిత, చింతరెడ్డిపల్లి (అమరచింత)

రెండో బిల్లు వచ్చింది..



అధికారుల సూచనతో ఇంటి నిర్మాణం చేపట్టా. ఆత్మకూర్ ఎస్‌బీఐ బ్యాంకు ఖాతా ఇచ్చా. ఇప్పటి వరకు రెండు విడతలుగా రూ.రెండు లక్షల బిల్లు వచ్చింది. ప్రస్తుతం స్లాబ్ పనులు పూర్తయ్యాయి. త్వరలోనే ఇంటి పనులు పూర్తి చేసుకుంటే పూర్తి బిల్లు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

– వెంకటన్నగౌడ్, చింతరెడ్డిపల్లి (అమరచింత)

అవగాహన కల్పిస్తున్నాం..



జిల్లాలో మొదటి విడత మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచడానికి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటి వరకు 499 మంది లబ్ధిదారులు బేస్‌మెంట్ వరకు నిర్మాణాలు పూర్తిచేశారు. బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిన వారి బ్యాంకు ఖాతాల్లో రూ.లక్ష జమ చేశాం. మిగిలిన లబ్ధిదారులతో ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించి సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బ్యాంకు ఖాతాల్లో లోపాలు గుర్తించి సవరిస్తూ బిల్లులు అందిస్తున్నాం.

– విఠోభా, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కేతేపల్లిలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ యాత్రలో రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

పాన్‌గల్: రాజ్యాంగాన్ని పరిరక్షించే **బాధ్యత అందరిపై** ఉందని రాష్ట్ర **ఎక్సైజ్, పర్యాటకశాఖ** మంత్రి జూపల్లి **కృష్ణారావు అన్నారు.** జై బాపు, జై **భీమ్, జై సంవిధాన్** పాదయాత్ర గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లి, కేతేపల్లి, జమ్మాపూర్‌లో కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ వారసత్వం, డా. బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా జై సంవిధాన్ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. కూడు, గూడు, గుడ్డ ప్రతి ఒక్కరికి అందించాలనేదే గాంధీజీ ఆలోచన అని.. ఆయన ఆశయ సాధనకు ఇందిరా గాంధీ ఎంతో కృషి చేశారని తెలిపారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న 70 ఏళ్లలో భారత రాజ్యాంగానికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రక్షించిందని.. నేడు బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను విడతల వారీగా అమలు చేస్తున్నామని.. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతాయన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ప్రతి నెల రూ.6,500 కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామని.. ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు.

ధాన్యం తరుగుపై ఆరా..

మిల్లర్లు తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న విషయంపై మంత్రి జూపల్లి పౌరసరఫరాల డీఎం జగన్మోహన్, ఆర్డీఓ సుబ్రమణ్యంతో ఆరా తీశారు. ఈ విషయంపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

మండల కేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు గురువారం కల్యాణలక్ష్మి చెక్కులను మంత్రి జూపల్లి కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, విండో డైరెక్టర్లు ఉస్మాన్, ప్రసాద్‌గౌడ్, కాంగ్రెస్‌పార్టీ మండల నాయకులు వెంకటేష్‌నాయుడు, రవికుమార్, భాస్కర్‌యాదవ్, రాముయాదవ్, నాగేంద్రం, బ్రహ్మయ్య, గిరిధర్‌నాయుడు, మండలస్థాయి అధికారులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రైతులకు పారదర్శక సేవలు



షాపురం రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

ఖిల్లాఘనపురం: రైతులకు పారదర్శకమైన సేవలు అందించే బాధ్యత అధికారులపై ఉందని రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండలంలోని షాపురం గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సదస్సుల్లో అధికారులు బాధ్యతగా వ్యవహరిస్తూ దరఖాస్తులకు సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తప్పుడు ఎంట్రీలకు నోటీసులు జారీ చేయాలని.. హెల్ప్‌డెస్క్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది రైతులకు పూర్తి సమాచారం అందించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

రైస్‌మిల్లు తనిఖీ..

గురువారం మండలానికి వచ్చిన రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించి రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. మిల్లుకు వచ్చిన ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతం చేయాలని యజమానిని ఆదేశించారు. దించుకున్న ధాన్యం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని.. సీఎంఆర్ కోసం మిల్లింగ్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలన్నారు. ఎక్కడా రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, మిల్లర్లు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ సుగుణ, సీనియర్ అసిస్టెంట్ కురుమూర్తి, ఆర్ఐ తిరుపతయ్య, పలువురు సిబ్బంది ఉన్నారు.

క్రమశిక్షణ, సమయపాలనతో గుర్తింపు



మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి: క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ, విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ అధికారుల మన్ననలు పొందాలని.. నీతి, నిజాయితీతో పనిచేసే వారికి పోలీసుశాఖలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల సిబ్బందికి విధుల నిర్వహణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని.. పోలీసుశాఖలో పని చేసే ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ కలిగి ఉండాలని, బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలు తెలుసుకోవాలని, న్యాయం జరుగుతుందనే నమ్మకం, భరోసా, భద్రత కల్పించాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, వివిధ వర్టికల్ విభాగాల్లో చక్కటి ప్రతిభ కనబర్చాలని, ఐటి సెల్ సేవలు వినియోగించుకొని జిల్లాను ముందువరుసలో నిలపడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిమ కనబర్చిన పోలీసు సిబ్బందిని ఎస్పీ శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ ఉమామహేశ్వరరావు, వనపర్తి సీఐ కృష్ణయ్య, ఆత్మకూర్ సీఐ శివకుమార్, రిజర్వ్ సీఐ అప్పలనాయుడు, డీసీఆర్బీ ఎస్ఐ రవిప్రకాష్ పాల్గొన్నారు.



అవగాహన సదస్సుకు హాజరైన పోలీసు సిబ్బంది

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



ఖిల్లాఘనపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ఖిల్లాఘనపురం/కొత్తకోట రూరల్/వనపర్తి రూరల్: రాష్ట్రంలోని అన్నివర్గాల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. గురువారం ఖిల్లాఘనపురంలోని పద్మశాలి కల్యాణ మండపంలో స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ యాదయ్య, హౌసింగ్ డీఈ విఠోభాతో కలిసి అలాగే పెద్దమందడి, శ్రీరంగాపురం, పెబ్బేరులోని ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమాల్లో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదోడి సొంతింటి కళ కలగానే మిగిలిందన్నారు. ఏడాదికి అయిదు ఇళ్లు ఇచ్చినా నేడు ఈ పరిస్థితి ఉండేది కాదని తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని.. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. వనపర్తిని పూరి గుడిసే లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని.. ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న తర్వాత చీర, పంచె, పసుపు, కుంకుమతో ఇళ్లకు వస్తామన్నారు. ఖిల్లాఘనపురం గణపసముద్రం రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులతో మాట్లాడటానికి శుక్రవారం అధికారులు వస్తారని.. అన్ని విషయాలు మాట్లాడుకోవాలని సూచించారు. త్వరలో జరిగే సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. అలాగే పెబ్బేరులో రుక్సానాబేగం ఇంటిని ముగ్గు వేసి ప్రారంభించారు. ఖిల్లా ఘనపురంలో జరిగిన కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ రాజు, తహసీల్దార్ సుగుణ, ఎంపీడీఓ వెంకటాచారి, పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ వెంకటయ్య, మాజీ సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, పెబ్బేరు, శ్రీరంగాపురంలో జరిగిన కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ గొని ప్రమోదిని, వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్‌రెడ్డి, విండో చైర్మన్ జగన్నాథంనాయుడు, తహసీల్దార్లు మురళిగౌడ్, రాజు, ఎంపీడీఓ రవీంద్ర, రవినారాయణ, డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకటేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

573 బస్సులకు నో ఫిట్‌నెస్

- ఉమ్మడి జిల్లాలో పునః ప్రారంభమైన పాఠశాలలు
- స్కూల్ బస్సులపై ఆర్టీఏ ప్రత్యేక డ్రైవ్ ప్రారంభం
- ఫిట్‌నెస్ లేకుండా నడిపితే కేసులు నమోదు



మహబూబ్‌నగర్‌లో స్కూల్ బస్సులు తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

జిల్లాల వారీగా ఇలా..

జిల్లా	మొత్తం బస్సులు	ఫిట్‌నెస్ చేసినవి	పరీక్షలు చేయనివి
మహబూబ్‌నగర్	457	300	157
నాగర్‌కర్నూల్	259	138	121
వనపర్తి	230	97	133
జోగుళాంబ గద్వాల	247	171	76
నారాయణపేట	143	57	86

పాలమూరు: ఉమ్మడి జిల్లాలో గురువారం నుంచి విద్యాసంస్థలు పునఃప్రారంభమయ్యాయి. అయితే జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేసుకోలేదు. చాలా బస్సులు ఫిట్‌గా లేకుండానే విద్యార్థులను తరలించడానికి సిద్ధమయ్యాయి. ఉమ్మడి జిల్లాలో 1,336 స్కూల్ బస్సులు ఉండగా.. ఇందులో బుధవారం సాయంత్రం వరకు 763 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తిచేయగా.. మరో 573 బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోలేదు.

డీటీఓలకు ఆదేశాలు..

ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ స్కూళ్లు, కళాశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోవడానికి ఇచ్చిన గడువు బుధవారంతో ముగియడంతో జిల్లా ఆర్టీఏ అధికారులు గురువారం నుంచి ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించారని డీటీసీ కిషన్ వెల్లడించారు. మొదట జిల్లాకేంద్రాలతో పాటు పాఠశాలలు అధికంగా నిర్వహించే పట్టణాల్లో ఆర్టీఏ బృందాలు ఫిట్‌నెస్, పర్మిట్ ఇతర పత్రాలు పరిశీలిస్తారని వివరించారు. స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా రోడ్లపై తిరిగితే చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతోపాటు 15 ఏళ్లు దాటిన వాహనాలపై కూడా ప్రత్యేక దృష్టిసారించి తనిఖీ చేపడుతామన్నారు. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేయడానికి అధికారులు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి ఇప్పటికే ఆయా జిల్లాల డీటీఓలకు ఆదేశాలు ఇచ్చినట్లు డీటీసీ పేర్కొన్నారు.

తాగునీటికి 20 క్యూసెక్కులు

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులకుగాను.. గురువారం 1,016 అడుగులు ఉన్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ, కుడి కాల్వల ద్వారా జలాశయానికి నీటి సరఫరా లేదని.. రామన్‌పాడు నుంచి కుడి, ఎడమ కాల్వలకు 12 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నట్లు వివరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



వనపర్తి విద్యావిభాగం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని.. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజేషన్ కో–ఆర్డినేటర్ యుగంధర్ కోరారు. గురువారం ఆత్మకూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల, జూరాలలోని ఉన్నత, జెడ్పీ బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ బడులను కాపాడుకునే బాధ్యత గ్రామంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు అంకితభావంతో విధులు నిర్వర్తిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బాలికలు భవిష్యత్‌లో ఎట్టి పరిస్థితుల్లో విద్యాభ్యాసం ఆపకుండా లక్ష్యాలను చేరుకునేలా ప్రోత్సహించాలన్నారు. బడిబాటలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఇదిలా ఉండగా.. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా విద్యార్థులకు స్వాగతం పలికేందుకు భవనాలను మామిడాకుల తోరణాలు, పూలమాలలతో అలంకరించడంతో పాటు డప్పుచప్పుళ్లతో ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పాము కాటుతో యువకుడి మృతి

మల్దకల్: యువకుడు పాముకాటుకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని అడి విరావల్‌చెర్వు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ ఈశ్వరయ్య తెలిపిన వివ రాల మేరకు.. గ్రామానికి చెందిన నాగరాజు (20) బుధవారం వ్యవసాయ పనులు ముగించుకొని అక్కడే ఉన్న గుడిసెలో నిద్రిం చాడు. తెల్లవారుజామున నిద్రలేవకపోవడం తో కుటుంబసభ్యులు పాము కాటు వేసినట్లు గుర్తించి గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ గురు వారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

తీర్థయాత్రలకు వెళ్లొస్తూ అనంతలోకాలకు


బోయ మూగి మద్దిలేటి (ఫైల్)

మానవపాడు: మండల కేంద్రానికి చెందిన బోయ మూగి మద్దిలేటి అనే వ్యక్తి తీర్థయాత్ర లకు వెళ్లి తిరుగు ప్రయాణంలో అనారో గ్యంతో మృతి చెం దాడు. వివరాల్లోకి వెళ్తే.. మద్దిలేటి మరో నలుగురు గ్రామస్తు లతో కలిపి ఈ నెల 5న కాశీ, అయోధ్యను సం దర్శించడానికి వెళ్లాడు. యాత్రలు ముగించు కొని రైలులో తిరిగి వస్తుండగా అనారోగ్యానికి గురై మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని బేతుల్ రైల్వేస్టే షన్‌లో మరణించాడు. పోలీసులు మృతదే హానికి పోస్ట్‌మార్టం నిర్వహించి, అక్కడి నుం చి అంబులెన్స్ ద్వారా మానవపాడుకు పం పారు. మద్దిలేటి మృతితో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మల్దకల్: విద్యుత్ సర్వీస్ వైర్‌ను సరిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలం లోని పావనంపల్లి గురువారం జరిగింది. వివరాలు.. పావనంపల్లి గ్రామానికి చెందిన తెలుగు పరుషరాముడు(45) ఇంటి ముందు ఉన్న విద్యుత్ స్తంభం నుంచి తన ఇంటికి తీసుకున్న సర్వీస్ వైర్ సరిచేస్తుండగా విద్యు దాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుని భార్య శారదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. విషయం తెలుసుకున్న జెడ్పీ మాజీ చైర్‌ప ర్సన్ సరిత, మండల నాయకులు ఆస్పత్రికి చేరుకొని మృతుని కుటుంబ సభ్యులను పరా మర్శించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

తెలకపల్లి: కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తెలకపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేశ్ వివరాల మేరకు.. బల్మూరు మండలం జినుకుంటకు చెందిన కురాకుల మహేశ్ (32), తన భార్య విడాకులు తీసుకొని విడిపోయారు. ఆ తర్వాత అతడికి దూరపు బంధువు అయిన తెలకపల్లి మండలం లక్నారం గ్రామానికి చెందిన శివలీలతో పరిచయమైంది. ఆమె కూడా తన భర్తతో విడాకులు తీసుకొని ఒం టరిగా జీవిస్తున్న క్రమంలో ఇద్దరు వివాహం చేసుకున్నారు. ఇటీవల శివలీల మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడటాన్ని గమనించిన భర్త మహేశ్ నిలదీశాడు. అయితే తన ప్రవ ర్తన మార్చుకోని శివలీల.. కుటుంబ సభ్యు లకు ఎవరికీ చెప్పకుండా 10 రోజులు ఎక్క డికో వెళ్లిపోయింది. ఆమె అదృశ్యం కావడంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆమె ఆచూకీని కనుగొని కుటుంబ సభ్యులకు అప్పగించడం తో పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి భార్యాభర్తలకు నచ్చజెప్పారు. ఆ తర్వాత తెలకపల్లిలో నివాసం ఉన్నప్పటికీ శివలీల తన ప్రవర్తన మార్చుకోకపోవడంతో మన స్తాపానికి గురైన భర్త మహేశ్.. తెలకప ల్లిలో తన సోదరి అంజలి నివాసముంటున్న అద్దె ఇంట్లో బుధవారం అర్ధరాత్రి ఉరే సుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువకుడి బలవన్మరణం

తెలకపల్లి: క్షణికావేశంలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ కథనం మేరకు.. మండలంలోని పెద్దూరుకు చెందిన పబ్బాల పరశురాములు (28) రెండు నెలలుగా ఎలాంటి పని చేయకుండా కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతుండటంతో భార్య, తల్లిదండ్రులు మందలించారు. దీం తో గురువారం ఉదయం ఇంట్లో సీసాలో ఉన్న పెట్రోల్ ఒంటిపై పోసుకొని నిప్పం టించుకున్నాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిం చారు. వైద్యుల సూచన మేరకు హైదరాబా ద్‌కు తీసుకెళ్తుండగా.. మార్గమధ్యంలో మృ తిచెందాడు. తండ్రి పబ్బాల కురుమయ్య ఫిర్యాదు మేరకు సాయంత్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరిం చారు. పరశురాములుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కోయిల్‌సాగర్‌కు కృష్ణాజలాలు

- ముందస్తు వర్షాలతో తరలి వస్తున్న నీళ్లు
- ఉంద్యాల తీలేర్ ఫేస్ వన్‌లో ఒక పంపు రన్
- 315 క్యూసెక్కుల నీటి విడుదల
- పదేళ్ల ఎత్తిపోతల చరిత్రలో ఇదే మొదటి సారి
- ఆనందంలో ఆయకట్టు రైతులు

దేవరకద్ర: జూన్ మొదటి వారం లేక రెండో వారంలో రుతుపవనాలు ప్రవే శించి వర్షాలు కురవడం ప్రతి ఏడు జరిగే విషయం. కొన్ని సార్లు రుతు పవనాలు ఆలస్యం కూడా అవు తాయి. అయితే ఈసారి మూడు వారా లు ముందుగానే రుతు పవనాలు పలకరించాయి. ఏకధాటిగా వర్షాలు కురవడంతో నేల తల్లి తడిసి ముద్ద యింది. ఇదే తరుణంలో రైతులు జో రుగా భూములు దుక్కిదున్ని వ్యవసా యానికి సిద్ధం చేసుకుంటున్నారు.

తరలి వస్తున్న కృష్ణా జలాలు..

జూరాల ప్రాజెక్టుకు పైనుంచి ఇన్‌ఫ్లో ప్రారంభమైతేనే కోయిల్‌సాగర్ లిఫ్ట్ పంపులను రన్ చేసి నీటిని విడుదల చేయాలనే నిబంధన ఉంది. ఈసారి మే చివరి వారంలోనే జూరాలకు భారీగా ఇన్‌ఫ్లో రావడంతో గేట్లను తెరిచారు. జూరాలకు ఇంకా ఇన్‌ఫ్లో కొనసాగుతుండడంతో కోయిల్‌సా గర్ ఎత్తిపోతల పథకం కింద ఉం ద్యాల వద్ద ఉన్న తీలేర్ ఫేస్‌వన్ పం పుహౌస్‌లో ఒక పంపును జూన్ 1నుంచి రన్ చేశారు. ఒక పంపు సామర్థ్యం 315 క్యూసెక్కులు ఉంది. రెండు పంపులు ఇక్కడ ఉన్నప్పటికీ సాంకేతిక లోపం వల్ల మరో పం పును రన్ చేయలేదని తెలుస్తోంది. ప్రస్తుతం చిన్నచింతకుంట మండ లంలోని ఫర్దీపూర్ రిజర్వాయర్‌కు నీరు చేరుతోంది. ఫర్దీపూర్ రిజర్వా యర్ నిండిన తరువాత అక్కడి నుం చి ఫేస్ టు తీలేర్ పంపుహౌస్‌కు నీటిని తరలిస్తున్నారు. అక్కడి నుంచి పంపులను రన్ చేసి కోయిల్‌సాగర్‌కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. వారం రోజులుగా కోయిల్‌సాగర్‌కు కృష్ణాజ లాలు చేరుతున్నాయని అధికారులు తెలిపారు.


కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటిమట్టం

ఎత్తిపోతల పథకంలో మరో చరిత్ర..

కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం ప్రారంభించిన పదేళ్ల తరువాత జూన్ మొదటి వారంలోనే నీటిని విడుదల చేయడం మరో చరిత్రగా చెప్పవచ్చు. 2006లో జలయజ్ఞంలో భాగంగా కోయిల్‌సాగర్ ఎతిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. దాదాపు పదేళ్ల తరువాత 2016లో ఎత్తిపోతలను ప్రారం భించి జూరాల నుంచి నీటిని కోయిల్‌సాగర్‌కు తరలిస్తున్నారు. ప్రతి ఏడాది జూలై చివరి వారం లేక ఆగస్టులో కోయిల్‌సాగర్‌కు నీటిని విడుదల చేసే వారు. ఈ ఏడాది ముందస్తు వర్షాల వల్ల నీటి విడుదల ముందుగానే చేపట్టారు. గతేడాది యాసంగి సీజన్ ప్రారంభంలో కూడా జూరాలలో పం పులను రన్‌చేసి ప్రాజెక్టుకు నీటిని తరలించారు. వేసవిలో నీటిని తేవడం కూడా ఎత్తిపోతల చరిత్రలో మొదటి సారే.

జూరాల నీటితో ప్రాజెక్టును నింపుతాం..



జూరాలకు ఇలాగే ఇన్‌ఫ్లో కొనసాగితే ఎత్తిపోతల పథకం ద్వారా కోయిల్‌సాగర్‌ను నింపుతాం. ప్రస్తుతం ఒక పంపును రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని విడు దల చేశాం. ముందుగా ఫర్దీపూర్ రిజర్వాయర్‌ను నింపాం. ఇక్కడి నుంచి తీలేర్ పంపుహౌస్‌కు నీటిని తరలించి.. అక్కడి నుంచి కోయిల్‌సాగర్‌కు పంపింగ్ చేస్తున్నాం. ప్రాజెక్టు పూర్తి స్థాయి కి చేరే వరకు నీటిని విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నాం.

– ప్రతాప్‌సింగ్, ప్రాజెక్టు ఈఈ, కోయిల్‌సాగర్

వరుణుడు కరుణించాడు..



ఈ ఏడాది వరుణుడు కరుణిం చాడు. ముం దస్తుగానే రుతుపవ నాలు రావడంతో భారీ వర్షాలు కురిశాయి. వైఎస్ హయాంలో భారీ వర్షాలు నమోదు కాగా, ప్రస్తుతం రేవంత్‌రెడ్డి హయాంలో కూడా భారీ వర్షాలు నమోద వుతున్నాయి. పంటలు సమృ ద్ధిగా పండించే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో ఆయకట్టు లక్ష్యం చేరుకుంటాం.

– మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్యే, దేవరకద్ర


ఉంద్యాల పంపు హౌస్ వద్ద ఒక పంపును రన్ చేసి నీటి విడుదల

11 అడుగలకు చేరిన నీటి మట్టం..

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 32.6 అడుగులు గా ఉంది. పాత అలుగు స్థాయి నీటి మట్టం 26.6 అడుగులుగా ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం 13.6 అడుగులుగా ఉంది. యాసంగి సీజన్ ప్రారంభంలో 32 అడుగులుగా ఉన్న నీటి మట్టం పంటలకు నీటిని వదలడం వల్ల తగ్గి పోయింది. ఎత్తిపోతల పథకం నీరు ప్రాజెక్టు చేరితే రోజు వారీగా నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. పెద్దవాగు ప్రవాహం ప్రారంభం అయితే ప్రాజెక్టుకు జలకళ సంతరించుకుంటుంది. ప్రస్తుతం ఉన్న నీటి మట్టానికి మరో 13అడుగుల నీరు చేరి కనీసం పాత అలుగు స్థాయికి నీటి మట్టం చేరితే వానాకాలం పం టలకు సకాలంలో నీటిని విడుదల చేసే అవకాశం ఉంది.

లారీ, ఓల్వో బస్సు ఢీ : 18 మందికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ యోగేష్ గౌతమ్

మక్తల్: ఆగి ఉన్న లారీని ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో 18 మందికి గాయాల య్యాయి. ఈ ఘటన మండలంలోని బొందల్‌కుంట స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున 5.30 గంట లకు చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. కర్ణాటకలోని శివమొగ్గ నుంచి 29 మంది ప్రయాణికులతో ఓల్వో బస్సు బుధవారం రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరింది. గురువారం తెల్లవారు జామున మండలంలోని బొందల్‌కుంట వద్ద 167 జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని బస్సు వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న లక్ష్మణ్, నవీన్, సంజీవ్, అన్నపూర్ణ, షరీఫ్, రహీం, మణెమ్మ, శంకర్, నర్సింహులు, రమేశ్ అనిత తదిత రులు మొత్తం 18 మంది ప్రయాణికులతో పాటు డ్రైవర్ సంజీవ్‌కు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న మక్తల్ సీఐ రాంలాల్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మిరెడ్డి ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను మక్తల్, రాయచూర్, మహబూబ్‌నగర్ ఆస్పత్రులకు తరలించారు. గురు వారం ఉదయం ఎస్పీ యోగేష్ గౌతమ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడు తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

నల్లబెల్లం స్వాధీనం: కేసు నమోదు

లింగాల: మండలంలోని మల్లొనిచె ర్వుతండా సమీపంలోని వ్యవసాయ పొలంలో అక్రమంగా ఉంచిన నల్లబె ల్లాన్ని గురువారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ వెం కటేశ్వర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన కాట్రావత్ లక్ష్మణ్ వ్యవసాయ పొలంలోని గడ్డివాములో సారాకు ఉపయోగించే నల్లబెల్లం దాచి ఉంచినట్లు సమా చారం అందడంతో సోదాలు నిర్వ హించారు. 20 బస్తాల బెల్లం, 5 కిలోల పటికను గుర్తించారు. లక్ష్మ ణ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

420 కిలోల బెల్లం పట్టివేత

డిండి: నాటుసారా తయారీకి విని యోగించే నల్లబెల్లాన్ని అక్రమంగా ఆటోలో తరలిస్తున్న వ్యక్తిని నల్లగొండ జిల్లా డిండి పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం సీబీ తండాకు చెందిన సభావత్ సురేందర్ తన ప్యాసిం జర్ ఆటోలో 14 బస్తాల్లో 420 కిలోల నల్లబెల్లం, 100 కిలోల పటి కను తరలిస్తుండగా.. పక్కా సమా చారం మేరకు డిండి మండల కేం ద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో పోలీసులు ఆటోను పట్టుకున్నారు. పట్టుబడిన నల్లబెల్లాన్ని, పటికను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన అంత్యక్రియలు


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: మండలంలోని గుడిబండకు చెందిన ముగ్గురు యువకులు బుధవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మాల్ పట్టణ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం పాఠకులకు విధితమే. కాగా వాస పవన్‌కుమార్ (26), వాస సాయితేజ (24), వాస రాఘవేంద్ర (22) మృతదేహా లకు శవ పరీక్షల అనంతరం బుధవారం రాత్రి స్వగ్రామానికి తీసుకొచ్చారు. గురువారం ఉదయం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుం బాలను పరామర్శించి మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలకు అం డగా ఉంటానని భరోసానిచ్చారు. ఒకేరోజు వేర్వేరు కుటుంబాలకు చెందిన ముగ్గురు యువకుల అంత్యక్రి యలు జరగడంతో గ్రామం దుఃఖ సాగరంలో మునిగి పోయింది. మృతుల్లో ఇద్దరికి వివాహం కాకపోవడం.. వాస పవన్‌కుమార్‌కు భార్య, ఏడాది వయసున్న చిన్నారి ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రుల రోద నలు అందరినీ కంటతడి పెట్టించాయి. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు శ్రీహరి, నాగిరెడ్డి, శెట్టి శేఖర్, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, శరత్‌రెడ్డి, చెన్నకేశవులు, శకుంతల, జగదీశ్, భరత్ ఉన్నారు.

శిక్షణ పొందిన వారికి స్వయం ఉపాధి

- 18 నుంచి మూడో బ్యాచ్ ప్రారంభం


మాట్లాడుతున్న 'నవరత్నాలు' శిక్షణ కేంద్రం పర్యవేక్షకుడు గుండా మనోహర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'మహ బూబ్‌నగర్ ఫస్ట్ – నవ రత్నాలు'లో శిక్షణ పొం దిన మహిళలకు 30 నుంచి 40 శాతం వరకు ఉద్యోగావకాశాలు లభించాయని పర్యవేక్షకుడు గుండా మనోహర్ తెలి పారు. ఇక మిగతా వారు ఇంటి వద్దే స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని బీకేరెడ్డి కాలనీలోని ఈ శిక్షణ కేంద్రంలో విలేక రులతో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సొంత నిధులతో కొనసాగుతున్న 'నవరత్నాలు' ముఖ్యంగా మహిళలకు వరంగా మారిందన్నారు. ఇక్కడ కంప్యూటర్, బ్యూటీషియన్, మగ్గంవర్క్, ఫ్యాషన్ డిజైనింగ్‌లో శిక్షణ ఉచితంగా ఇస్తున్నామన్నారు. మొదటి బ్యాచ్‌లో 217 మం ది, రెండో బ్యాచ్‌లో 247 మంది విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నా రన్నారు. ఏదైనా యూనిట్ ఏర్పాటు చేసుకునే వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు యత్నిస్తున్నామన్నారు. మొదటి బ్యాచ్ పూర్తి చేసిన వారికి ఈనెల 17న ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అదేరోజు రెండో బ్యాచ్ వారికి ఫేర్‌వెల్ పార్టీ ఉంటుందన్నారు. మూడో బ్యాచ్‌కు అడ్మిషన్లు జరుగుతున్నాయని 18న శిక్షణ తరగతులు ప్రారంభమవు తాయన్నారు. అలాగే స్పోకెన్ ఇంగ్లిష్ కోర్సును సైతం ప్రవేశపెట్టే ఆలోచన ఉందన్నారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్ నిజలింగప్ప, సెట్విన్ కో–ఆర్డినేటర్ విజయకుమార్, 'నవరత్నాలు' ఫ్యాకల్టీలు గౌతమి, భవాని, కవిత, అనూష తదితరులు పాల్గొన్నారు.

యోగాపై ఖైదీలకు శిక్షణ

మహబూబ్‌నగర్ క్రైం: ఈ నెల 21న ప్రపంచ యోగా దినోత్సవం సం దర్భంగా జిల్లా జైలులో ఖైదీలకు పదిరోజుల పాటు యోగాపై నిర్వహించే ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సం దర్భంగా జైలు సూపరిం టెండెంట్ వెంకటేశం మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్య సంరక్షణతో పాటు యోగా నేర్చుకోవ డానికి ఈ శిక్షణ కార్య క్రమం ఉపయోగప డుతుందన్నారు. జైలులో పది రోజులు యోగా ఆస నాలపై ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ నెల 21న జైలులో ప్రపంచ యోగా దినో త్సవం నిర్వహిస్తామని పేర్కొన్నారు.


యోగాసనం వేసిన ఖైదీలు

మహబూబ్‌నగర్‌ను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రంలో క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని మహబూబ్‌నగ ర్‌ను క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతామని ఉమ్మడి జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ఎన్.పి వెంక టేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడి యంలో గురువారం రాష్ట్రస్థాయి వాలీబాల్ సెల క్షన్స్ నిర్వహించగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అనేక మంది బాల, బాలికలు పాల్గొ న్నారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదు వులోనే కాకుండా క్రీడల్లోనూ రాణించి భవిష్య త్తుకు బాటలు వేసుకోవాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, క్రీడా శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వాకిటి శ్రీహరి, శాట్ చైర్మన్ శివసేనారెడ్డి జిల్లాకు చెందిన వారేనని, వీరి హయాంలో క్రీడా రంగం అభివృద్ధి పథంలో వెళ్లడం ఖాయమ న్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్ రవీందర్, డీవైఎస్‌ఓ శ్రీనివాస్, సరూర్‌నగర్ డీవైఎస్‌ఓ సెలక్షన్ కమిటీ నామినీ వెంకటేశ్వర్లు, ఎల్‌బీ స్టేడియం వాలీబాల్ కోచ్ ప్రవీణ, జింఖానా వాలీబాల్ కోచ్ రుషిందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీజీపీఈ సెట్ ఈవెంట్స్


100 మీటర్ల పరుగు పందాన్ని ప్రారంభిస్తున్న పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీలో టీజీపీఈ సెట్–2025 ఈవెం ట్స్ రెండో రోజు గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. ఈవెంట్స్‌ను రాష్ట్ర హయ్యర్ ఎడ్యు కేషన్ కౌన్సిల్ వైస్‌చైర్మన్లు పురుషోత్తం, శ్రీరామ్ వెంకటేశ్‌తో పాటు పీయూ వీసీ శ్రీనివాస్ పరిశీ లించారు. ముందుగా 100 మీటర్ల రన్నింగ్‌ను వారు గన్ పేల్చి ప్రారంభించారు. ఈ సందర్భం గా ఏర్పాటుచేసిన సమావేశంలో వీసీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. మొదటి రోజు ఎంపికలను పూర్తి పారదర్శకంగా నిర్వహించామన్నారు. మిగతా ఈవెంట్స్ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా పూర్తిస్థాయిలో చర్యలు తీసు కుంటున్నట్లు వివరించారు. రెండో రోజు బీపె డ్‌లో 544 మందికి గాను 370 మంది, డీపెడ్‌లో 231 మందికి గాను 145 మంది అభ్యర్థులు హాజ రయ్యారు. కార్యక్రమంలో సెట్ కన్వీనర్ దిలీప్, రిజిస్ట్రార్ రమేశ్‌బాబు, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా సంబరాలు చేద్దాం


ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని సన్మానిస్తున్న పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు

- ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులను ఆహ్వానిద్దాం
- బాదేపల్లి హైస్కూల్ శతాబ్ది ఉత్సవాల ప్రారంభంలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: బాదేపల్లి బాలుర జెడ్పీ హైస్కూల్ శతాబ్ది ఉత్సవాలను చరిత్రలో నిలిచిపోయేలా చేసు కుందామని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. హైస్కూల్ ప్రారంభించి వందేళ్లు పూర్త యిన సందర్భంగా పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్, మొక్కలు నాటే కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ హైస్కూల్‌లో చదివిన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, ఉపాధ్యాయు లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కోఆర్డినేషన్ కమిటీ తేదీ నిర్ణయిస్తే మూడు రోజుల ఉత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, గవర్నర్‌తో పాటు మం త్రులను ఆహ్వానించే బాధ్యత తీసుకుంటానన్నారు. వేడుకలకు తనవంతు పూర్తి సహకారం అందిస్తాన న్నారు. అయితే శీతాకాల విడిది కోసం హైదరాబా ద్‌కు వచ్చే రాష్ట్రపతిని ఆహ్వానించి, అదే సమయం లో వేడుకలు నిర్వహించాలని కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కోరుతున్నారని, అందుకోసం ముఖ్యమం త్రి ద్వారా ప్రయత్నిద్దామని తెలిపారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణను సైతం కలుసుకుని రాష్ట్ర పతిని ఆహ్వానిద్దామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు బి.రవిశం కర్, వి.కృష్ణ, రమణాచార్యులు, ఇబ్రహీం, వెం కటేశ్, పెద్దిబాలు, పరమటయ్య, శ్రీహరి, సంతోష్ చారి, బాబర్, మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, వార్డుకౌ న్సిలర్ రఘురాంగౌడ్, పట్టణ ప్రముఖులు బి.శి వకుమార్, కె.లక్ష్మయ్య, ఎంఈఓ మంజులాదేవి, ప్రధానోపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జూరాలకు 14,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ధరూరు/ఆత్మకూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు 14,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని పేర్కొన్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్‌కేంద్రాల్లో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి చేపడు తున్నారు. ఇందుకోసం 7,469 క్యూసెక్కులు వినియోగించుకుంటున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 1500 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 68 క్యూసెక్కులు ప్రాజెక్టు నుం చి మొత్తం 9,352 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 8.750 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువలో ఒక యూనిట్ల ద్వారా 38 మెగావాట్లు 16.877 మిలియన్ యూనిట్లు, దిగు వలో 1 యూనిట్ల ద్వారా 40 మెగావాట్లు 18.576 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని ఎస్‌ఈ శ్రీధర్ తెలి పారు. రెండు ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటివరకు 35.453 మిలి యన్‌యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

■ శ్రీశైలం జలాశయానికి 9,653 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతుంది. ప్రస్తుతం శ్రీశైలంలో నీటిమట్టం 836.5 అడు గుల వద్ద 56.8886 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 833 క్యూసెక్కుల నీటిని విడుదల చేశా రు. ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో 2.593 మి.యూ. విద్యు దుత్పత్తి చేస్తూ 5,604 క్యూసెక్కులు, ఏపీజెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 0.913 మి.యూ. ఉత్పత్తి చేసి 1,878 క్యూసెక్కుల నీటిని దిగువున సాగర్‌కు విడుదల చేశారు.

రోడ్డు ధ్వంసం కేసులో జైలుశిక్ష

గద్వాల క్రైం: ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులకు ఆటంకం కలిగించి, నిర్మాణాలు ధ్వంసం చేసిన కేసులో నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ మహబూబ్‌నగర్ మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి కళ్యాణ్ చక్రవర్తి గురువారం తీర్పు వెల్లడించినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పూర్తి వివరాలు.. జనవరి 5, 2018లో అనంతపురం స్టేజీ నుంచి ఇటిక్యాల మండలానికి అధికారులు రోడ్డు పనులు ప్రారంభిం చారు. ఈ క్రమంలో గద్వాల మండలం అనంతపురం గ్రామా నికి చెందిన ఎస్ విష్ణువర్ధన్‌రెడ్డి తన పొలం వద్ద యంత్రాల సాయంతో రోడ్డు ధ్వంసం చేసి మట్టిని వాహనాల ద్వారా తర లించినట్లు అప్పటి ఆర్‌అండ్‌బీ అధికారి ఏఈఆర్ సంగేశ్వర్ లక్ష్మణ్‌కుమార్ రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అప్పటి ఎస్‌ఐ అంజాద్ అలీ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం ప్రస్తుత డీఎస్పీ మొగిలయ్య, సీఐ శ్రీను, ఎస్‌ఐ శ్రీకాంత్ ఆధారాలను కోర్టులో అందజేశారు. వాదోపవా దనలు విన్న న్యాయమూర్తి నిందితుడు విష్ణువర్ధన్‌రెడ్డికి 6 నెలలు జైలు శిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తు తీర్పు వెల్లడిం చారు. కేసు విచారణలో నిందితుడికి శిక్ష పడేలా చేసిన సిబ్బం ది కృషి అభినందనీయమని ఎస్పీ పేర్కొన్నారు.